

రాష్ట్ర బీజేపీకి నూతన ఎన్నికల ఇన్‌చార్జులు



బైజయంత్ పాండా, మురళీధర్ మొహోల్

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా నూతన ఎన్నికల చార్జులను నియమించింది. ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పాండా, కేంద్ర సహాయమంత్రి మురళీధర్ మొహోల్‌లను ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నూతన ఇన్‌చార్జుల నేతృత్వంలో అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. శాసనసభకు వచ్చే ఏడాది జరుగనున్న ఎన్నికల కోసం అన్ని పార్టీలు ఇప్పటికే ముమ్మర సన్నాహాలు చేపట్టాయి. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకున్న బీజేపీ కూడా కింది స్థాయి నుంచి ప్రచారం మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో, పార్టీ నూతన ఎన్నికల చార్జ్‌లు నియమితులయ్యారు.

అసెంబ్లీ ఎన్నికల్లో పది స్థానాల్లో ఎంఎన్ఎం పోటీ?

● పార్టీ సమావేశంలో నేతల సూచన



చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలోని 'మక్కల్ నీదిమయ్యం' (ఎంఎన్ఎం) ఈ సారి ఆచితూచి అడుగులేయాలని నిర్ణయించుకుంది. 'ఇండియా' కూటమిలో వున్న ఆ పార్టీ.. ఇప్పటికే తమకు మెరుగైన అవకాశాలున్న నియోజకవర్గాలను గుర్తించడంతో పాటు ఆ స్థానాలను డీఎంకే తమకు కేటాయించేలా ఒత్తిడి పెంచాలని భావిస్తోంది. ప్రస్తుతం అన్ని పార్టీలూ అసెంబ్లీ ఎన్నికల వైపే దృష్టిసారిస్తున్నాయి. ఆ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహరచనలు రూపొందించుకుంటున్నాయి. ఆ కోవలోనే ప్రముఖ సినీ నటుడు కమల్ హాసన్ నేతృత్వంలోని ఎంఎన్ఎం గత నాలుగు రోజులుగా పార్టీ నాయకుల సమావేశాలు జరిపి అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపింది. 2018లో పార్టీని ప్రారంభించిన కమల్ మరుసటి సంవత్సరమే జరిగిన లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగారు. పార్టీ కంటూ ప్రత్యేక ఓటు బ్యాంక్ సంపాదించుకున్నారు. 2021లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేసింది. పలువురు అభ్యర్థులు ప్రత్యర్థులకు గట్టిపోటీ ఇచ్చి అత్యధికంగా ఓట్లు సంపాదించుకున్నారు. కోవైలో పోటీ చేసిన కమల్.. స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు 39 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 9 శాతం ఓట్లు, ఎనిమిది నియోజకవర్గాలలో 10 శాతం ఓట్లు పొందారు. అదే విధంగా 71 నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు 5 వేలకు పైగా ఓట్లు సాధించారు. ఆ తరువాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమికి మద్దతు పలికారు. అయితే ముందస్తు ఒడంబడిక మేరకు డీఎంకే పార్టీ కమల్ రాజ్యసభ స్థానం ఇచ్చింది. ప్రస్తుతం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ గురించి వారి అభిప్రాయాలను కమల్ తెలుసుకున్నారు. పార్టీ నిర్వాహకులందరూ అసెంబ్లీ ఎన్నికల్లో 10కి పైగా సీట్లలో పోటీ చేయాలని, ఆ దిశగా డీఎంకే కూటమి నుండి సీట్లు పొందాలని సూచించారు. చివరగా కమల్‌హాసన్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నాయకులు ఆశించినంత సీట్లు పొందటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



పథకం లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, స్టాలిన్

అందరికీ నాణ్యమైన విద్య
అదే మా ఆశయం

● విద్యే భావితరాలకు బంగారు బాట ● సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అందరికీ నాణ్యమైన విద్య అందించటమే కాకుండా వారికి ఉన్నత ఉద్యోగావకాశాలు కల్పించడమే డీఎంకే ద్రావిడ తరహా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, విద్యతోనే భావితరాలు బాగుపడతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. స్థానిక నెహ్రూ స్టేడియంలో గురువారం సాయంత్రం 'విద్యలో తమిళనాడు అగ్రస్థానం' పేరుతో పుదుమైపెన్, నాన్ ముదల్వన్ పథకాల విస్తరణ సభలో ఆయన ప్రసంగిస్తూ.. విద్యాపరమైన పథకాల వల్ల లబ్ధి పొందినవారిని, దేశవిదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు పొందినవారిని ఒక వేదికపై చూడటం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రచారార్భాటం కోసం, పొగడ్తల కోసం ఏర్పాటు చేయలేదని, ఈ కార్యక్రమాన్ని చూసి తదుపరి బ్యాచ్ విద్యార్థులకు విద్యపై ఆసక్తి కలుగుతుందనే ఆశయంతోనే ఈ భారీ వేడుకలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం కోసం తన సోదరి కనిమొళి చెప్పగానే తప్పకుండా వస్తానని మాటిచ్చి వచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా స్టాలిన్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు అమలు చేస్తున్న వెలుగు బాట పయనం లాగే తెలంగాణలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, అదే విధంగానే ఆ రాష్ట్రంలో అమలు చేసే మంచి పథకాలను తమిళనాట అమలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్టాలిన్ పేర్కొన్నారు. పోరాటాల ద్వారా ఆవిర్భవించిన తెలంగాణా రాష్ట్రాన్ని ఉద్యమ స్ఫూర్తితోనే రాహుల్‌గాంధీ ప్రతినిధిగా ఆ రాష్ట్రానికి అన్ని రంగాల్లో రేవంత్‌రెడ్డి అభివృద్ధి పరుస్తున్నారని కొనియాడారు. వెయ్యేళ్లకు పైగా తమిళ సమాజంలో జాతి, కులమనే దుష్టశక్తులు ఆధిక్యత ఉండటం వల్ల సామాన్య ప్రజానీకం విద్యకు దూరమవుతూ వచ్చిందని, ఆధిక్య శక్తులకు వ్యతిరేకంగా ద్రావిడ ఉద్యమం జరగడం వల్లే విద్య అందరికీ అందుబాటులోకి రాగలిగిందన్నారు. రాష్ట్రంలో న్యూజస్టిస్ పార్టీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసిందని, ఆ పథకం పలు మార్పులు తర్వాత బడిపిల్లల పౌష్టికాహార పథకంగా మారిందన్నారు. ఆ రీతిలోనే ప్రాథమిక విద్యకు దూరమవుతున్న చిన్నారును బడులకు రప్పించేందుకే వారి ఆకలిని తీర్చేలా అల్పాహార పథకాన్ని అమలు చేశామన్నారు. పాఠశాలలో చదివే విద్యార్థినుల కోసం మాజీ సీఎం కరుణానిధి ఉచిత బస్ పాస్ తీసుకువస్తే, తమ ప్రభుత్వం సిటీ టౌన్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే వెలుగుబాట పయనం పథకాన్ని అమలు చేసిందన్నారు. విద్యను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకే పుదుమైపెణ్, తమిళ్‌పుదల్వన్ పథకం, నాన్ ముదల్వన్ పథకం, మాడల్ స్కూళ్లు, స్మార్ట్ తరగతులు, క్రీడారంగంపై ప్రత్యేక శ్రద్ధను కనబరిచే పథకాలు అమలు చేస్తూ వస్తున్నామని చెప్పారు. ఒక పూట అన్నంపెడితే, ప్రతినెలా వెయ్యిరూపాయలిస్తే ఏం మార్పులు సంభవిస్తాయంటూ హేళనగా విమర్శలు చేసినవారంతా ఈ పథకాలు విజయవంతంగా కావడంతో ఖంగుతిన్నారని స్టాలిన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పుదుమైపెన్, తమిళ్‌పుదల్వన్ పథకాల విస్తరణ లోగో తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవిష్కరించారు. ఆ సందర్భంగా నలుగురు లబ్ధిదారులకు చెక్కులను రేవంత్ రెడ్డి అందజేశారు. ఈ వేడుకలలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రూ, నటుడు శివకార్తికేయన్, ఎండీఎంకే నేత వైగో, ఎంపీ కనిమొళి. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు కోవి చెళియన్, అన్బిల్ మహేష్, మదివేందన్, టీఆర్బీ రాజా, అగరం ఫౌండేషన్ నిర్వాహకులు నటుడు శివకుమార్, సినీ దర్శకులు మిష్కిన్, మారి సెల్వరాజ్, వెట్రిమారన్, క్రికెటర్ నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.



కేరళ సీఎం పినరయి విజయన్‌ను సత్కరిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం

బీజేపీ పాలనలో మహిళలకు భద్రత కరువు

● 'ఐద్వా' 17వ రాష్ట్ర మహాసభలో కేరళ సీఎం పినరయి విజయన్

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో మహిళలకు భద్రత కరువైందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆరోపించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) 17వ రాష్ట్ర మహాసభలు కన్నియాకుమారి జిల్లా కుళిత్తురైలో బుధవారం ప్రారంభమయ్యాయి. తొలుత పడన్తాలుముట్టి నుంచి ఐద్వా కార్యకర్తలు చేపట్టిన ర్యాలీని ఆ సంఘ ఉపాధ్యక్షురాలు సుధా సుందరరామన్ ప్రారంభించారు. తిరుత్తువపురం, కుళిత్తురై జంక్షన్ మీదుగా ఎగ్జిబిషన్ మైదానం వరకు ర్యాలీ సాగింది. అనంతరం రాత్రి జరిగిన బహిరంగ సభలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ... 2014లో అధికారం చేపట్టిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామనే హామీ అమలుచేయడంలో విఫలమైందని, మహిళలకు భద్రత, రక్షణ కల్పించేలా కేంద్రప్రభుత్వం ఎలాంటి ప్రత్యేక చట్టం తీసుకురాలేదని ఆరోపించారు. మహిళల భద్రతపై వర్మ కమిషన్ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో మహిళలు, పిల్లలకు 2 శాతంలోపే నిధులు కేటాయించారన్నారు. కానీ, కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం, మహిళలు, పిల్లలకు భద్రత, రక్షణ కల్పించేలా పలు పథకాలు, చర్యలు చేపట్టామని తెలిపారు. మణిపూర్‌లో మహిళలపై హింసాత్మక ఘటనలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేరళ, తమిళనాడులోని బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను గవర్నర్లతో ఇబ్బంది పెట్టేలా కేంద్రం చర్యలు చేపట్టిందన్నారు. వచ్చే ఏడాది జరిగే తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని కోరారు. పోరాటాల ద్వారా తమ హక్కులు సాధించుకోవచ్చని పలు సందర్భాల్లో నిరూపణ అయిందని, ఆ రీతిలో ఉద్యమాలకు యువత, మహిళలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు సిద్ధం కావాలని కేరళ సీఎం పినరయి విజయన్ పిలుపునిచ్చారు.

పీఎంకే సభాపక్ష నాయకుడిగా వెంకటేశ్వరన్

అసెంబ్లీ కార్యదర్శికి అన్బుమణి వర్గం ప్రతిపాదన



శాసనసభ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాది బాలు, ఎమ్మెల్యే వెంకటేశ్వరన్

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పీఎంకే శాసనసభాపక్ష నాయకుడిగా ఉన్న జీకే మణిని ఆ పదవి నుండి తొలగించాలని కోరుతూ డాక్టర్ అన్బుమణి వర్గీయులు అసెంబ్లీ కార్యదర్శి కే శ్రీనివాసన్‌కు వినతి పత్రం సమర్పించారు. గురువారం ఉదయం అన్బుమణి వర్గానికి చెందిన న్యాయవాది కే బాలు సచివాలయంలో శ్రీనివాసన్‌ను కలుసుకుని పీఎంకే శాసనసభా పక్షనేతగా, విప్‌గా తమ వర్గానికి చెందిన వెంకటేశ్వరన్, శివకుమార్‌లను నియమించాలని ప్రతిపాదించారు. ఈ విషయమై సచివాలయం వెలుపల న్యాయవాది బాలు మీడియాతో మాట్లాడుతూ శాసనసభలో ఐదుగురు పీఎంకే శాసనసభ్యులున్నారని, వారిలో జీకే మణి, అరుళ్ పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌కు మద్దతిస్తున్నారని, తక్కిన ముగ్గురు శాసనసభ్యులు డాక్టర్ అన్బుమణికి మద్దతిస్తున్నారని, ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని తమ వర్గానికి చెందిన శాసనసభ్యుడు వెంకటేశన్‌ను పార్టీ సభాపక్ష నాయకుడిగా గుర్తించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అక్టోబర్ 14 నుంచి శాసనసభ సమావేశాలు జరుగనుండటంతో ఆ లోగా అన్బుమణి వర్గానికి చెందిన వెంకటేశన్‌ను సభాపక్షనేతగా ప్రకటించాలని అసెంబ్లీ కార్యదర్శిని కోరినట్లు చెప్పారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు పోటీ చేయడానికి బీఫాంలో సంతకం చేసే హక్కు అన్బుమణికి మాత్రమే ఉందని చెప్పారు. గతంలో కర్ణాటక, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లోనూ పీఎంకే పోటీ చేసిందని, త్వరలో బిహార్‌కు జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పోటీ చేసే విషయంపై అన్బుమణి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఇదిలా ఉండగా డాక్టర్ రాందాస్ వర్గానికి చెందిన శాసనసభ్యుడు అరుళ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఓ లేఖ రాస్తూ పీఎంకేలో ఏర్పడిన సంక్షోభ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్ తరచూ బయటి ప్రాంతాలకు వెళ్తున్నందున ఆయనకు పటిష్టమైన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాందాస్ నివసిస్తున్న తైలాపురం గార్డెన్‌కు భారీ భద్రత కల్పించాలని కోరారు.



గవర్నర్ చేతుల మీదుగా పట్టాలందుకున్న విద్యార్థులు

ఘనంగా తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

ప్యారీస్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేటలోని తమిళనాడు ఓపెన్ యూనివర్శిటీ 16వ స్నాతకోత్సవం గురువారం గవర్నర్ ఆర్ఎన్ రవి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆర్ముగం, రిజిస్ట్రార్ సెంథిల్‌కుమార్ నవీన, ఎగ్జామ్స్ కంట్రోలర్ ఉమా మహేశ్వరి, ప్రొఫెసర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. గౌరవ అతిథిగా హాజరై అహ్మదాబాద్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఉపాధ్యాయి ముత్తులక్ష్మితో పాటు గవర్నర్ ఆర్ఎన్ రవి మొత్తం 7,970 మంది విద్యార్థిని, విద్యార్థులకు పట్టాలు, పతకాలు అందించి అభినందించారు. 15 మంది పీహెచ్‌డీ, 17 మంది విద్యార్థులు బంగారు పతకాలు సొంతంచేసుకున్నారు.

మా కార్యకర్తలను చేర్చుకోవడం

కూటమి ధర్మానికే విరుద్ధం

● డీఎంకే నేత సెంథిల్‌బాలాజీపై ఎంపీ జ్యోతిమణి ఆగ్రహం






చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డీఎంకే మాజీ మంత్రి, ఆ పార్టీ కరూరు జిల్లా ఇన్‌ఛార్జి సెంథిల్ బాలాజీ కాంగ్రెస్ సభ్యులకు డీఎంకే సభ్యత్వం కల్పించి పార్టీలో చేర్చుకోవడంపై ఆ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా వీరిద్దరి మధ్య వైరం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల సెంథిల్ బాలాజీ తన ఎక్స్‌పేజీలో కరూరు నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కవిత డీఎంకేలో చేరారని, దేశానికి స్టాలిన్ నాయకత్వం అవసరమనే ఆలోచనతోనే కవిత డీఎంకేలో చేరినట్లు ఓ సందేశం వెలువరించారు. ఆ సందేశాన్ని అర్జెంటీనాలో ఉన్న జ్యోతిమణి గమనించి సెంథిల్ బాలాజీపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎక్స్‌పేజీలో ఘాటుగా సమాధానం ఇచ్చారు. కూటమి ధర్మం రెండు వైపులా ఉండాలని, ఓ మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీని బహిరంగంగా ఇలా అవమానించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. పరస్పర అవగాహన, సహకారం, నమ్మకం, గౌరవం ఆధారంగానే కూటమి ఏర్పడుతుందని ఎట్టి పరిస్థితుల్లో వీటిలో ఏదీ అతిక్రమించకూడదన్నారు. తాను వెల్లడించిన అభిప్రాయాలను టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ అర్థంచేసుకోగలుగుతారని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ వివాదానికి సంబంధిం చి రాష్ట్ర మహిళ కాంగ్రెస్ నాయకురాలు హసీనా సయ్యద్ ఓ ప్రకటన చేస్తూ సెంథిల్‌బాలాజీ సమక్షంలో డీఎంకే సభ్యత్వం స్వీకరించిన మహిళ కాంగ్రెస్ పార్టీకి చెందినవారే కారని, ఇదిగమనించిన సెంథిల్‌బాలాజీ కూడా తప్పు జరిగిందంటూ ఎక్స్‌పేజీలో పెట్టిన ఆ సందేశాన్ని తొలగించారని ఆమె పేర్కొన్నారు.

కెడిలం వాగుపై రూ.16.75 కోట్లతో ఫ్లై ఓవర్

● శంకుస్థాపన చేసిన మంత్రి పన్నీర్‌సెల్వం



శంకుస్థాపన కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి పన్నీర్‌సెల్వం

ప్యారీస్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా తిరువేంది పురం మున్సిపాలిటీ ఓటేరి సమీపంలోని కెడిలం వాగుపై రూ.16.75 కోట్లతో నిర్మించనున్న ఫ్లైఓవర్‌కు గురువారం వ్యవసాయశాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం శంకుస్థాపన చేశారు. కడలూరు-తిరుకోవిలూరు మార్గంలో బిళ్లాలి ప్రాంతం, ఓటేరి గ్రామాల మధ్య కెడిలం వాగుపై నిర్మించిన తాత్కాలిక రోడ్డు ఇటీవల కురిసిన భారీవర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో ఆ వాగు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు సుమారు 12 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రజల విజ్ఞప్తి పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం కెడిలం వాగుపై రూ.16.75 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. దీనికి సంబంధించి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో కలెక్టర్ ఆదిత్యా సెంథిల్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ ప్రియాంక, గ్రామీణాభివృద్ధిశాఖ ఇంజనీర్ వరదరాజపెరుమాళ్, డీఆర్వో ఎస్.పాండియన్ తదితరులు పాల్గొన్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ, సీఎం గ్రామీణ రోడ్ల అభివృద్ధి పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా వాగులపై నిర్మించిన దారులను తొలగించి ఆ ప్రాంతాల్లో వంతెనలు నిర్మించేలా చర్యలు చేపడతామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని మంత్రి తెలిపారు.



సేమాతమ్మన్ ఆలయ జీర్ణోద్ధరణ పనులపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

రూ.74.30 లక్షలతో పెరంబూరు సేమాతమ్మన్ ఆలయ జీర్ణోద్ధరణ

● ప్రారంభించిన మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరులోని సేమాతమ్మన్ ఆలయంలో రూ.74.30లక్షలతో చేపట్టనున్న జీర్ణోద్ధరణ పనులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు గురువారం ప్రారంభించారు. ఆ ఆలయంలో జరిగే మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. మహామండపం నిర్మాణాన్ని, కొలను మరమ్మతు పనులను అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నాలుగన్నరేళ్లలో 12,199 ఆలయాల్లో రూ.6,991కోట్లతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇదే విధంగా రూ.8 వేల కోట్ల విలువైన ఆలయ ఆస్తులను ఆక్రమణల నుంచి విముక్తి కలిగించామని ఆయనపేర్కొన్నారు. మంత్రితోపాటు మేయర్ ప్రియ ఇతర అధికారులు కూడా ఆలయ జీర్ణోద్ధరణ పనులను పరిశీలించారు.

సమాచార దృశ్యిని

స్కాలర్‌షిప్‌తో శిక్షణ

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కెనరా బ్యాంకుల్లో, నెలకు రూ.15,000 స్కాలర్‌షిప్‌తో 'ఇంటర్న్‌షిప్' శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన డిగ్రీ పూర్తిచేసిన వారు https://ibpsreg.ibps.in/ canbaug25/ అనే వెబ్‌సైట్‌లో అక్టోబరు 27వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటన విడుదలైంది.

స్టాన్లీ వైద్యకళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్టాన్లీ ప్రభుత్వ వైద్యకళాశాలలో మెడికల్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 30వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... స్టాన్లీ వైద్యకళాశాలలో కార్డియో సోనోగ్రఫీ టెక్నీషియన్ (మహిళలు), ఈసీజీ అండ్ ట్రెడ్మిల్ టెక్నీషియన్, పంప్ టెక్నీషియన్, ఐసీయూ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నీషియన్ సహా పలురకాల ఏడాది సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నారు. మహోన్నత పాఠశాల విద్యలో ఉత్తీర్ణులై, 2025 డిసెంబరు 31వ తేదీకి 17 ఏళ్లు పూర్తయ్యేవారు దరఖాస్తు చేసుకోవచ్చు స్టాన్లీ వైద్య కళాశాల మెడికల్ విభాగం-3లో దరఖాస్తు పొంది ఈ నెల 30లోగా సమర్పించాలి. అక్టోబరు 6 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. వివరాలకు 9840505701 అనే నెంబరు, stanleycollege19@ gmail.com అనే ఈ-మెయిల్ సంప్రదించవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

ఏడు లక్షల 'రేబిస్' వ్యాక్సిన్ కొనుగోలు

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్థం శాఖ ఆధ్వర్యంలో, రూ.2.5 కోట్లతో రేబిస్ వ్యాక్సిన్ కొనుగోలు చేయనున్నారు. వీధి, పెంపుడు శునకాల దాడిలో పలువురు గురవుతుండగా, శునకం కరిచినా పట్టించుకోని వారు రేబిస్ సోకి మృత్యువాత పడుతున్నారు. ఈ వ్యాధికి అడ్డుకునేలా వీధి, పెంపుడు శునకాలకు స్థానిక సంస్థలు రేబిస్ వ్యాక్సిన్ ఉచితంగా అందజేస్తున్నారు. పశు వైద్యశాలల్లో మాత్రం ఒక రేబిస్ వ్యాక్సిన్‌కు రూ.17 చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో, ఏడు లక్షల రేబిస్ వ్యాక్సిన్ కొనుగోలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

చెన్నై-హాంకాంగ్ విమానాల రద్దు

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హాంకాంగ్‌లో భారీవర్షాల కారణంగా చెన్నూ రావాల్సినవి, నగరం నుంచి వెళ్లాల్సిన రెండు విమానాలు రద్దయ్యాయి. హాంకాంగ్ నుంచి నగరానికి బుధవారం అర్ధరాత్రి 12.15 గంటలకు రావాల్సిన కైతే పసిఫిక్ ఎయిర్ లైన్స్ విమానం, హాంకాంగ్‌లో భారీ వర్షాల కారణంగా రద్దయింది. మరుమార్గంలో నగరం నుంచి గురువారం వేకువజామున 1.15 గంటలకు హాంకాంగ్ బయల్దేరాల్సిన విమానం రద్దయిందని అధికారులు ప్రకటించారు.

నాలుగు గంటలు ఆలస్యంగా లండన్ విమానం...

వాతావరణం అనుకూలించకపోవడంతో లండన్ నుంచి నగరానికి రావాల్సిన విమానం ఆలస్యంగా బయల్దేరింది. లండన్ నుంచి నగరానికి గురువారం వేకువజామున 3.30 గంటలకు రావాల్సిన బ్రిటీష్ ఎయిర్‌లైన్స్ విమానం నాలుగు గంటలు ఆలస్యంగా ఉదయం 7.50 గంటలకు చేరుకుంది. మరుమార్గంలో నగరం నుంచి ఉదయం 5.35 గంటలకు బయల్దేరాల్సిన విమానం నాలుగు గంటల ఆలస్యంగా 9.30 గంటలకు బయల్దేరి వెళ్లింది.

ఫిబ్రవరి 17 నుంచి సీబీఎస్‌ఈ పబ్లిక్ పరీక్షలు

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ పాఠ్యాంశంలో చదివే విద్యార్థులకు 10, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు, వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభం కానున్నాయి. మొట్టమొదటి సారిగా 10వ తరగతికి రెండు విడతల పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సీబీఎస్‌ఈ విడుదల చేసిన ప్రకటనలో... ప్రస్తుత విద్యా సంవత్సరం 10, ప్లస్ టూ పరీక్షల్లో సుమారు 45 లక్షల మంది విద్యార్థులున్నారు. ఈ పరీక్షలకు దేశంలోనే కాక 26 దేశాల విద్యార్థులు కూడా పాల్గొననున్నారు. 10వ తరగతికి రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించనుండగా , తొలి విడత ఫిబ్రవరి 17 నుంచి మార్చి 6వ తేది వరకు, రెండో విడత మే 15 నుంచి జూన్ 1వ తేది వరకు జరుగనున్నాయి. ప్లస్ టూ పరీక్షలు ఫిబ్రవరి 17న ప్రారంభమై ఏప్రిల్ 9వ తేది వరకు కొనసాగనున్నాయి. ఒక్కో పరీక్ష ముగిసిన 10 రోజుల్లో, మూల్యాంకనం ప్రారంభించి 12 రోజుల్లో పూర్తి చేసి ఫలితాలు వెల్లడించనున్నట్లు సీబీఎస్‌ఈ తెలిపింది.

'చెన్నై వన్' టిక్కెట్టు మూడు గంటల్లోపు వినియోగించుకోవాలి

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'చెన్నై వన్' యాప్ ద్వారా సబర్బన్ రైళ్లలో ప్రయాణించేందుకు టిక్కెట్లు పొందిన వారు, మూడు గంటలలోగా వినియోగించుకోవాలని దక్షిణ రైల్వే తెలిపింది. ఈ విషయమై దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నగరంలో సబర్బన్ రైళ్లు, మెట్రో, ఎంటీసీ బస్సులు, ఆటో, టాక్సీల్లో ప్రయాణించేందుకు వీలుగా 'చెన్నై వన్' యాప్‌ను ఈ నెల 22న ముఖ్యమంత్రి స్టాలిన్ పరిచయం చేశారు. ఈ యాప్ ద్వారా సబర్బన్ రైలు టిక్కెట్లు పొంది ప్రయాణించవచ్చు. ఇప్పటికే అందుబాటులో ఉన్న యూటీఎస్ యాప్ లాగే, ఈ యాప్ కూడా ప్రయాణికులు వినియోగించుకోవచ్చు. సబర్బన్ రైలు ఛార్జీల్లో ఎలాంటి మార్పులుండవు, 'ఏసీ' సబర్బన్ రైలు టిక్కెట్లు మాత్రం పొందేందుకు వీలు లేదు. టిక్కెట్ వెరికేషన్ సమయంలో, ప్రయాణికులు 'ఒరిజినల్ రైలు టికెట్ చూపించు' పేజీ ద్వారా తమ టిక్కెట్లు చూపించాల్సి ఉంటుంది. ఒకసారి పొందిన టిక్కెట్లు రద్దు చేయడం సాధ్యం కాదు. ఈ టిక్కెట్టు పొందిన తదుపరి మూడు గంటల్లోపు ప్రయాణం చేయాలని దక్షిణ రైల్వే తెలియజేసింది.

తిరుమల బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

అడయార్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నుంచి వెళ్లే భక్తుల సౌకర్యార్థం పలు నగరాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) విడుదల చేసిన ప్రకటనలో... తిరుమల బ్రహ్మోత్సవాలు అక్టోబరు 2వ తేది వరకు జరుగనున్నాయి. ఈ వేడుకలకు పాల్గొనే భక్తుల సౌకర్యార్థం చెన్నై, తిరుచ్చి, తంజావూరు, సేలం, కోయంబత్తూర్, మదురై, కారైక్కుడి, కుంభకోణం, నాగపట్టణం, సెంగోట్టై తదితర ప్రాంతాల నుంచి తిరుమలకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. భక్తులు www.tnstc.in అనే వెబ్‌సైట్‌లో ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలని ఎస్‌ఈటీసీ తెలిపింది.

చిరు వ్యాపారులకు గొడుగుల వితరణ

పార్యీస్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆర్యవైశ్య మహిళాసభ-మద్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్ వ్యాపారులకు ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు. టి.నగర్‌లోని టీటీడీ ఆలయం సమీపంలో సభ మాజీ అధ్యక్షురాలు ఊరా శశికళ నివాసంలో బుధవారం సాయంత్రం 15 మంది చిరువ్యాపారులకు గొడుగుల వితరణ చేశారు. సభ నూతన చైర్‌పర్సన్ ప్రశాంతి, కార్యదర్శి భార్గవి, కోశాధికారి ప్రసన్న, ఊరా శశికళ, వైజయంతి, మలిక, ఉమా గుప్తా, నీరజ, మల్లిక, సుమతి, రజిని, నందా, జయశ్రీ పాల్గొన్నారు. అలాగే దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని తిరువళ్లూరు జిల్లా ఆర్యపాక్కం గ్రామంలో ఉన్న విద్యారంభ జ్ఞానసరస్వతి ఆలయంలో ఈ నెల 29న ఒక్కొక్క దేవతకు ఒక్కో వృక్షం చొప్పున 9 రకాల ఔషధ మొక్కలు నాటనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



చిరువ్యాపారులకు గొడుగులు అందిస్తున్న సభ్యులు

● నవరాత్రి ఎఫెక్ట్..

తిరుత్తణిలో భారీగా పెరిగిన పూలధరలు





తిరుత్తణి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో ఘనంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఉత్సవాల్లో అమ్మవారిని రకరకాల పుష్పాలతో అలంకరిస్తారు. అదేవిధంగా ఇళ్లలో నిర్వహించే బొమ్మల కొలువులకు కూడా అధిక మొత్తంలో పూలను వినియోగిస్తుంటారు. ఆ రీతిలో తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలోని పూల దుకాణాల్లో పూల ధరలు పెరిగాయి.. సాధారణ వేళల్లో రూ.300 ఉన్న పూలమాల ఇప్పుడు రూ.500, కిలో మల్లెపూలు రూ.350 నుండి రూ.550కి విక్రయిస్తున్నారు. దీనిపై భక్తులు ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. సాధారణం కంటే ఎక్కువ ధరలకు పూలను విక్రయిస్తున్న దుకాణాల లైసెన్సులు రద్దు చేయాలని ఆలయ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు.

వేదారణ్యంలో నీటి కోసం స్థానికుల రాస్తారోకో



రోడ్డుపై బిందెలు ఉంచి రాస్తారోకో చేస్తున్న స్థానికులు

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేదారణ్యం తాలూకాలోని తులసాపురం పంచాయతీలోని తులసాపురం, మహారాపురం, సొక్కై గ్రామాల్లో తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని కోరుతూ స్థానికులు రాస్తారోకో నిర్వహించారు. గురువారం ఉదయం ఆ మూడు గ్రామాల ప్రజలు ఖాళీ బిందెలను రహదారిపై ఉంచి ఆందోళనకు దిగారు. ఈ మూడు గ్రామాల్లో సుమారు 1200లకు పైగా కుటుంబాలున్నాయి. వీరికి కొళ్ళిడం సమగ్రనీటి పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నెలల తరబడి ఈ గ్రామాలకు రెండు రోజులకొకమారు, వారానికి ఒకమారు చొప్పున తాగునీటిని సరఫరా చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఆ గ్రామాల ప్రజలు రహదారిపై ఖాళీ బిందెలు ఉంచి రాస్తారోకోకు దిగారు. ఈ సమాచారం తెలుసుకున్న కారియపట్టిణం సీఐ నాగలక్ష్మి ఆ ప్రాంతానికి చేరుకుని స్థానికులతో చర్చించారు. ఆ మూడు గ్రామాలకు సక్రమంగా తాగునీరు సరఫరా అయ్యేలా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

అనాథాశ్రమంలో బాలుడిపై బెల్టుతో దాడి

● విచారణకు కలెక్టర్ ఆదేశం



బాలుడిని బెల్టుతో కొడుతున్న వ్యక్తి (వీడియోఫొటో)

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా కోట్టయ్‌పాళయంలోని అనాథాశ్రమంలో ఓ బాలుడిపై గుర్తు తెలియని వ్యక్తి బెల్టుతో దాడి జరిపిన సంఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు అధికారులు విచారణ జరుపుతున్నారు. ఆ అనాథాశ్రమంలో తల్లిదండ్రులు లేని 26 మంది బాలబాలికలు ఉంటున్నారు. ఇటీవల ఆ అనాథాశ్రమంలో బాలురు కూర్చుని చదువుతుండగా అక్కడికి వెళ్ళిన ఓ వ్యక్తి వారిలో ఓ బాలుడిని పిలిచి ఏదో అడిగాడు. ఆ బాలుడు సక్రమంగా సమాధానం చెప్పకపోవటంతో ఆ వ్యక్తి తన ప్యాంట్ బెల్టు లాగి, చితకబాదాడు. బెల్టు దెబ్బలు తాళలేక ఆ బాలుడు అరిచినా అనాథశ్రమంలో పనిచేస్తున్న సిబ్బంది మౌనంగా ఉండిపోయారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో తీవ్రంగా వైరల్ అయ్యింది. దీంతో జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్ విచారణకు ఆదేశించారు. పోలీసుశాఖ, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆ సంఘటనపై విచారణ జరిపి తగు చర్యలు చేపడతారని కలెక్టర్ ప్రకటించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా తాంబరం, మాడంబాక్కం, రెడ్‌హిల్స్, థౌజండ్ లైట్స్. సెంబియం, పోరూర్ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ బోర్డు ఓ ప్రకటనలో పేర్కొంది. ఆ ప్రాంతాల వివరాలిలు...

తాంబరం: పుదుతాంగళ్ ముల్లై నగర్ టీఎస్ హెచ్‌బీ, స్టేట్ బ్యాంక్ కాలనీ, ముడిచూర్ రోడ్డు, ఓల్డ్ తాంబరం, పటేల్ నగర్, ఇరుంబులియూర్, వైగై నగర్, సాయి నగర్, టీటీకే నగర్, పెరియార్ నగర్, కృష్ణా నగర్, కుల్లకారి, టౌన్ తాంబరం, సీటీఓ కాలని, శక్తి నగర్, కన్నడపాళయం, కిష్కింద రోడ్డు, పులికోరాడు, రెడ్డియార్ పాళయం, కల్యాణ నగర్, మేలాండై వీధి, భారతి నగర్, గుడ్‌విల్ నగర్, వీరలక్ష్మి నగర్, గాంధీ నగర్, కన్నన్ అవెన్యూ, కురింజి నగర్, అముదం నగర్, నిత్యానంద నగర్, పెరుమాళ్ వీధి, జ్యోతి నగర్. **మేడంబాక్కం:** అగరం మెయిన్ రోడ్డు, మెప్పేడు జంక్షన్, భారతిదాసన్ వీధి, సెక్రటరీయేట్ కాలని, వేంగడమంగళం మెయిన్ రోడ్డు, తిరువాంజేరి.

రెడ్‌హిల్స్: సొత్తుపెరుంబేడు, నారాయణంబేడు, చోళవరం, కోట్టైమేడు, పెరియ కాలని, సెంబులివరం, ఒరక్కాడు రోడ్డు.

థౌజండ్ లైట్స్: అన్నాసాలై మదర్సా బిల్డింగ్ ఫస్ట్ పాయింట్, గ్రీమ్స్ రోడ్డు, ఆలి టవర్, ఎంఆర్ఎఫ్, రంగూన్ వీధి ఫస్ట్ పాయింట్, అన్నాసాలై, మాకిస్ గార్డన్, షఫీమహ్మద్ రోడ్డు, అపోలో మెయిన్, గ్రీమ్స్ లైన్, స్పెన్సర్‌ప్లాజా మాల్

సెంబియం: తనికాచలం నగర్, శక్తివేల్ నగర్, ప్రభు వీధి, 80 అడుగుల రోడ్డు, శక్తివినాయగర్ ఆలయ వీధి, మేరిఇలియన్ వీధి, అన్నల్ గాంధీ వీధి, దక్షిణామూర్తి వీధి, రామలింగ కాలని, ఎంపీఎం వీధి, సుబ్రమణి నగర్, కార్ నగర్, తిరుప్పూర్ కుమరన్ నగర్, తిరువిక వీధి, కామరాజ్ నగర్, అసిరియర్ వీధి, నటేశన్ వీధి, శ్రీనివాస నగర్, సెల్వం నగర్, గాంధీమతి వీధి.

పోరూర్: కుండ్రత్తూర్ రోడ్డు, కారంబాక్కం, మాదానందపురం, మౌంట్ పూందమల్లి రోడ్డు, గెరుగంబాక్కం, ముగలివాక్కం, రామాపురం, చిన్న పోరూర్, కోలపాక్కం.

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం జరుగనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలను జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రకటన మేరకు శిబిరాలు జరిగే ప్రాంతాల వివరాలిలా ఉన్నాయి... తిరువొత్తియూర్ మండలం 11వ వార్డు ఎల్లయమ్మన్ ఆలయ వీధి సమీపంలోని వివేకానంద విద్యాలయ జూనియర్ కళాశాల, మాధవరం మండలం 28వ వార్డు పాల కాలనీలోని తనువాస్ మినీ హాలు, తండయార్‌పేట మండలం 48వ వార్డు పార్థసారథి వీధిలో పాండియన్ థియేటర్ ప్రాంగణం, రాయపురం మండలం 60వ వార్డు జార్జిటౌన్ అంగప్పన్‌నాయకన్ వీధిలోని చెన్నై ఉర్దూ మాధ్యమిక పాఠశాల, తిరువిక నగర్ మండలం 75వ వార్డు ఓట్టేరి జంక్షన్ రోడ్డులో ఉన్న మూలిగై పూంగా మైదానం, అంబత్తూర్ మండలం 93వ వార్డు మొగప్పేర్ నందిలి లక్ష్మణన్ వీధి ఏఎస్ఎస్ మహల్, అన్నానగర్ మండలం 98వ వార్డు కీల్పాక్కం ఆస్ప్రిన్ గార్డన్ 6వ వీధిలో ఉన్న వార్డు కార్యాలయం, తేనాంపేట మండలం 119వ వార్డు రాయపేట అవ్వై షణ్ముగ రోడ్డులోని నల్వావు కల్యాణ మండపం ప్రాంతాల్లో శిబిరాలు జరుగనున్నాయి. అలాగే, కోడంబాక్కం మండలం 128వ వార్డు విరుగంబాక్కం కామరాజ్ రోడ్డులో ఉన్న కమ్యూనిటీ హాలు, వలసరవాక్కం మండలం 149వ వార్డు డాక్టర్ రాధాకృష్ణన్ రోడ్డులో ఉన్న కల్యాణ మండపం, ఆలందూర్ మండలం 166వ వార్డు నంగనల్లూర్ విశ్వనాథన్ పురం మెయిన్ రోడ్డు కనకాంబాళ్ కాలనీలో ఉన్న కేసీటీ మహల్, షోలింగనల్లూర్ మండలం 200వ వార్డు సెమ్మంజేరి పళతోట రోడ్డులోని కార్పొరేషన్ కమ్యూనిటీ హాలు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

పాల ఉత్పత్తుల ధర తగ్గించాలి

● ఆవిన్ ఏజెంట్ల డిమాండ్

పార్యీస్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు అమలుకు వచ్చినా పాల ఉత్పత్తుల ధరలు తగ్గించని ఆవిన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నుంగంబాక్కంలోని జీఎస్టీ (కౌన్సిల్) కార్యాలయంలో ఆవిన్ ఏజెంట్లు ఫిర్యాదు చేశారు. ఈ ఏజెంట్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు పొన్నుస్వామి సభ్యులతో కలిసి బుధవారం జీఎస్టీ కార్యాలయానికి వెళ్లి జీఎస్టీ అడిషనల్ కమిషనర్ లోకనాధరెడ్డికి ఫిర్యాదుపత్రం అందజేశారు. అందులో పాలు, పన్నీరుకు జీఎస్టీ రద్దుచేశారని, నెయ్యి, వెన్న తదితరాలకు జీఎస్టీని 12శాతం నుండి 5శాతానికి తగ్గించారని, అయితే రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని ఆవిన్ సంస్థ ఇప్పటి వరకు పాల ఉత్పత్తుల ధర తగ్గించలేదని, దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా వారు కోరినట్లు పొన్నుస్వామి తెలిపారు.

దీపావళి, ఆయుధ పూజ సందర్భంగా ప్రత్యేక బస్సులు

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆయుధ పూజకు 3,225, దీపావళికి 9,963 ప్రత్యేక బస్సులు నడపాలని రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) నిర్ణయించింది. ఆయుధపూజ, దీపావళి సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపడంపై సచివాలయంలో బుధవారం అధికారులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అధికారులు వివరిస్తూ.... ఆయుధపూజ, వరుస సెలవుల కారణంగా, శుక్రవారం నుంచి 30వ తేది వరకు 3,225 ప్రత్యేక బస్సులు సహా 11,593 బస్సులు నడుపనున్నామని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 16 నుంచి 19వ తేది వరకు 5,710 ప్రత్యేక బస్సులతో పాటు 14,078 బస్సులు నడుపనున్నామన్నారు. అలాగే, పండుగల తరువాత నగరానికి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం అక్టోబరు 21 నుంచి 23వ తేది వరకు 4,253 ప్రత్యేక బస్సులతో పాటు 10,529 బస్సులు నడుపనున్నామని తెలిపారు. ఆ ప్రకారం, 9,963 ప్రత్యేక బస్సుల సహా 24,607 బస్సులు నడపాలని నిర్ణయించినట్లు, ప్రత్యేక బస్సులపై అధికారిక ప్రకటన వచ్చే నెల మొదటి వారంలో రవాణా శాఖ మంత్రి ప్రకటిస్తారని అధికారులు తెలిపారు.

బెంగళూరులో ల్యాండైన చెన్నై విమానం

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో ల్యాండ్ కావాల్సిన విమానం బెంగళూరులో ల్యాండింగ్ కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఢిల్లీ నుంచి చెన్నైకి 165 మంది ప్రయాణికులతో బుధవారం సాయంత్రం 6.07 గంటలకు విమానం బయల్దేరింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో చెన్నై సమీపానికి వచ్చింది. విమానాశ్రయ సమాచార నియంత్రణ టవర్ నుంచి విమానం ల్యాండింగ్‌కు అనుతించారు. కానీ, విమానం మూడుసార్లు ల్యాండింగ్ అయ్యేందుకు యత్నించినా, ఫలించకపోవడంతో, ఆకాశంలోనే చక్కర్లు కొట్టి, 8.40 గంటలకు బెంగళూరు విమానాశ్రయంలో ల్యాండింగ్ అయింది. అక్కడి నుంచి బయల్దేరి 9.40 గంటలకు చెన్నై చేరుకుంది. మరుమార్గంలో, చెన్నై నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన విమానం నాలుగు గంటలకు ఆలస్యంగా అర్ధరాత్రి 1.30 గంటలకు బయల్దేరింది. ఈ కారణంగా అటు బెంగళూరు, ఇటు చెన్నై విమానాశ్రయాల్లో ప్రయాణికులు చాలాసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చెన్నై విమానాశ్రయ అధికారులు క్షమాపణలు కోరారు. నిర్వహణ కారణాలతో విమానం దారి మళ్లించినట్లు తెలిపారు.

ఇసుక అక్రమ తరలింపు

● రెండు ట్రక్కులు స్వాధీనం

వేలూరు, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి క్రిస్టియన్‌పేట సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రక్కులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే ఆ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుకు గత కొద్దిరోజులుగా నదీ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తునానరనే ఫిర్యాదుతో పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో, బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీలో ఇసుక లోడుతో వస్తున్న రెండు ట్రక్కులను ఆపి పరిశీలించగా, వారివద్ద ఇసుక రవాణాకు సంబంధించి ఎలాంటి ధ్రువపత్రాలు లేవని తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకునే నేపథ్యంలో, వారు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో పోలీసులు ఆ ట్రక్కులను స్వాధీనం చేసుకుని పరారైన డ్రైవర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

● నకిలీ పాస్‌పోర్ట్ కేసు ...

ఐదుగురు పోలీసుల సహా 50 మందిపై ఛార్జిషీటు

అడయార్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నకిలీ పాస్‌పోర్ట్ కేసులో 50 మందిపై కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. ఐపీఎస్ అధికారి డేవిడ్‌సన్ దేవాశీర్వాదం మదురై నగర పోలీసు కమిషనర్‌గా వ్యవహించిన సమయంలో నకిలీ పత్రాలతో సుమారు 200 మందికి పైగా పాస్ పోర్టులు మంజూరుచేసినట్లు ఆరోపణలు తలెత్తాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలంటూ గోరి వరాహి మద్రాసు హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలుచేశారు. ఈ కేసు ప్రధాన న్యాయమూర్తి ఎంఎం శ్రీవాస్తవ, న్యాయమూర్తి అరుళ్‌మురుగన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ కేసులో ఐపీఎస్ అధికారి డేవిడ్‌సన్‌కు సంబంధాలు లేవని హైకోర్టు మదురై బెంచ్ జారీచేసిందని రాష్ట్ర ప్రభుత్వం తరపున ధర్మాసనానికి తెలియజేశారు. అలాగే, హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులతో, ఐదుగురు పోలీసులు సహా 50 మందిపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు, వారికి వ్యతిరేకంగా ఛార్జీషీటు దాఖలుచేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో, హైకోర్టు మదురై బెంచ్ ప్రత్యేక న్యాయమూర్తి ఉత్తర్వులను ధర్మాసనం ధృవీకరించి, ఈ పిటిషన్‌లో ఎలాంటి ఉత్తర్వులు జారీచేయలేమని పేర్కొన్న ధర్మాసనం, విచారణలో కోర్టులో ఐపీఎస్ అధికారి డేవిడ్‌సన్‌ను విచారించాలని పిటిషన్ దాఖలుచేయవచ్చని పిటిషన్‌దారుడికి సూచించి, తదుపరి విచారణ అక్టోబరు 7వ తేదీకి వాయిదావేసింది.

30న సంగీత దర్శకుడు జీవీ-సైంధవి కేసు తీర్పు

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్-సైంధవి వివాహ రద్దు కేసులో ఈ నెల 30న తీర్పు చెప్పనున్నట్లు చెన్నై ఫ్యామిలీ కోర్టు ప్రకటించింది. జీవీ ప్రకాష్, సైంధవి ఇద్దరూ పరస్పరం విడిపోతున్నట్లు ప్రకటించి విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ కేసు విచారణకు గురువారం ఇద్దరూ కోర్టులో హాజరయ్యారు. పిల్లలను సైంధవి సంరక్షించడంలో తనకు ఎలాంటి ఆక్షేపణ లేదని జీవీ ప్రకాష్ తెలిపారు. దీంతో, ఈ కేసు తీర్పు ఈ నెల 30వ తేది వెలువరించనున్నట్లు కోర్టు ప్రకటించింది.

గంజాయి విక్రయం... ఐటీ ఉద్యోగి సహా ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం నుంచి ఆన్‌లైన్‌లో గంజాయి కొనుగులు చేసి నగరంలో విక్రయిస్తున్న వ్యవహారంలో ఐటీ ఉద్యోగి సహా ఇద్దరిని విజిలెన్స్ విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. కేరళ రాష్ట్రంలో ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు పొంది గంజాయి విక్రయిస్తున్న ముఠాను ఆ రాష్ట్ర పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుంచి ఆన్‌లైన్ గంజాయి కొనుగోలు చేసిన వారి వివరాలను పోలీసులు సేకరించగా, వారిలో చెన్నై ఐటీ ఉద్యోగి ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని కేరళ రాష్ట్ర పోలీసులు, చెన్నై విజిలెన్స్ పోలీసులకు సమాచారం అందించారు. ఆ ప్రకారం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసులు వెస్ట్ సైదాపేట రామాపురం రామస్వామి వీధిలో నివసిస్తున్న గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఐటీ ఉద్యోగి మల్లికా అర్జునన్ శర్మ ఇంట్లో తనిఖీ చేసి 120 ఎస్‌ఎస్టీ స్టాంపులు, 2.61 గ్రాముల కెట్టామైన్, 58 మి.గ్రా ఓజీ గంజాయి, గంజాయి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అర్జునన్ శర్మను పోలీసులు విచారించగా, తన వ్యాపార భాగస్వామి వెస్ట్ మాంబళం అన్నామలైనగర్ 1వ వీధికి చెందిన బాలసూర్య ద్వారా నగరవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు పొంది గంజాయి సరఫరా చేస్తున్నట్లు వాంగ్మూలం ఇచ్చాడు. ఈ వ్యవహారంలో అర్జునన్ శర్మ, బాలసూర్యలను అరెస్ట్ చేసిన పోలీసులు, ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయం ఉందా? అంటూ విచారణ చేపట్టారు.

ట్రాఫిక్ ఎస్‌ఐపై దాడికేసులో కానిస్టేబుల్ సస్పెన్షన్

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూక్కడై ప్రాంతంలో ట్రాఫిక్ ఎస్సైపై దాడిచేసిన కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటుపడింది. ఆంధ్ర రాష్ట్రం తిరుమలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు పూక్కడై నుంచి తిరుమల గొడుగుల ఊరేగింపు ఈ నెల 22వ తేది జరిగింది. ఊరేగింపు సందర్భంగా పూక్కడై ట్రాఫిక్ విభాగం పోలీసులు ట్రాఫిక్ క్రమబద్దీకరించారు. ట్రాఫిక్ పర్యవేక్షించాలని కానిస్టేబుల్ మణికంఠన్‌ను ట్రాఫిక్ ఎస్‌ఐ దర్శన్ తెలుపడంతో, అతను ఎస్‌ఐతో వాగ్వివాదానికి దిగాడు. అది కాస్త తారస్థాయికి చేరడంతో ఆగ్రహించిన మణికంఠన్, తన సహచర పోలీసుల సమక్షంలో ఎస్‌ఐ దర్శన్‌పై దాడిచేశాడు. దీంతో చెవి నొప్పితో ఎస్‌ఐ రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ వ్యహారంపై పూక్కడై ట్రాఫిక్ అధికారి దినేష్ విచారణ నివేదిక ఆధారంగా, కానిస్టేబుల్ మణికంఠన్‌ను అధికారులు సస్పెండ్ చేశారు..

తరగతి గదిలో విద్యార్థులపై కత్తితో దాడి

పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో ఇద్దరు విద్యార్థులపై సహచర విద్యార్థి కత్తితో దాడిచేసిన ఘటన తిరునల్వేలి జిల్లాలో చోటుచేసుకుంది. ఏర్వాడి సమీపం దొనవూరులో ఎయిడెడ్ మహోన్నత పాఠశాల 9వ తరగతి గదిలో బుధవారం ఓ విద్యార్థితో సహచర విద్యార్థి హేళనగా మాట్లాడడంతో, ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగింది. గురువారం ఉదయం తరగతి గదికి వచ్చిన విద్యార్థి తనను హేళనచేసిన విద్యార్థిపై హఠాత్తుగా కత్తితో దాడిచేశాడు. ఈ విషయం గమనించిన మరో విద్యార్థి దాడిని అడ్డుకొనేందుకు యత్నించగా, అతనిపై కూడా కత్తితో దాడిచేశాడు. ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయం కావడంతో, ఉపాధ్యాయులు వారిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ వ్యవహారంపై ఏర్వాడి పోలీసులు విచారణ చేపట్టారు.

రేబిస్‌తో 17 ఏళ్ల బాలుడి మృతి


పెరంబూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలో రేబిస్‌తో 17 ఏళ్ల బాలుడు మృతిచెందాడు. అన్నానగర్ గుడ్‌చెట్ వీధికి చెందిన రామనాథన్ కుమారుడు రాజ్‌ప్రకాష్ (17) చిన్నకడైలోని మాంసం దుకాణంలో పనులకు వెళ్తుంటాడు. కొద్దిరోజుల క్రితం బాలుడిని వీధి కుక్క కరిచింది. అనంతరం అనారోగ్యానికి గురైన రాజ్‌ప్రకాష్‌ను కుటుంబ సభ్యులు రామనాథపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అతనికి రేబిస్ సోకినట్లు వైద్యులు నిర్ధారించి మెరుగైన చికిత్స కోసం మదురై పంపించారు. ఈ క్రమంలో, అక్కడ చికిత్స ఫలించక బుధవారం రాజ్‌ప్రకాష్ మృతిచెందాడు. అతని మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో పాల్గొన్న 25 మందికి జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రేబిస్ టీకాలు వేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు అవినీతి వ్యవహారం

ప్రత్యేక దర్యాప్తు కమిటీ కోసం పిటిషన్

పార్యీస్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డు మదురై డివిజన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలులో జరిగిన అవినీతిపై ప్రత్యేక దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయాలంటూ వేసిన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు విచారణ జరపనుంది. మదురై ఉసిలంపట్టికి చెందిన రాజ్‌కుమార్, హైకోర్టు మదురై బెంచ్‌లో ఓ పిటిషన్ వేశారు. అందులో టీఎన్‌ఈబీకి 2021, 2023వ సంవత్సరాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను కొనుగోలు చేయాలని నిర్ణయించారని, దీనికి సంబంధించిన టెండర్‌లో పాల్గొనాల్సినవారిని ముందే ఎంపిక చేసి అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. 26,300 హైవోల్టేజీ ట్రాన్స్‌ఫార్మర్లను రూ.1,068 కోట్లకు కొనుగోలు చేయాల్సివుందని, అయితే అధికారుల తప్పిదం వల్ల సుమారు రూ.350 కోట్లు అదనంగా చెల్లించారని, ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు అధికారం ఉన్నతాధికారులు, అప్పటి విద్యుత్‌శాఖ మంత్రి సెందిల్‌బాలాజీకి మాత్రమే ఉందని, ఈ అవినీతిపై విచారణ జరిపేందుకు ప్రత్యేక దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా ఆ పిటిషన్‌లో న్యాయస్థానాన్ని కోరారు. గురువారం ఈ పిటిషన్ హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ అనితా సుమంత్, జస్టిస్ కుమరప్పన్ ముందు విచారణకు వచ్చింది. 'ఇలాంటి కేసులు మద్రాస్ హైకోర్టు ప్రథమ ధర్మాసనంలో విచారణలో ఉన్నాయని, మదురై టీఎన్‌ఈబీ అవినీతి కేసులు కూడా చెన్నైకి బదిలీ చేయాలని ప్రభుత్వ తరుపు న్యాయవాదులు కోరారు. ఈ అభ్యర్థన మేరకు న్యాయమూర్తుల బెంచ్ ఈ పిటిషన్ విచారణను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు చేశారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి హారతి

పార్యీస్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరుక్కుపేట చిగురింత పాలెం రెండవ వీధిలోని కళి వెంకటేశ్వర భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. తిరుమల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని లోక కల్యాణార్థం 21వ వార్షిక అన్నదానం, విశేషపూజలను ఈ నెల 19 నుండి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణ ఘట్టంతో ప్రారంభమయ్యాయి. వేదిక ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతర గణపతి పూజ, గోపూజ, కంకణధారణ అనంతరం అగ్ని ప్రతిష్ఠ, సంకల్పపూజలను పూజారి శంకర్ బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. అనంతరం పండితులు వేదమంత్రోచ్ఛరణ, మేళతాళాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య శ్రీవారి కల్యాణం చేశారు. భక్తులందరికీ తిరుపతి లడ్డూ, అన్నప్రసాదం, ముత్తైదువులకు పసుపు కుంకుమను నిర్వాహకుల తరుపున కర్రా వెంకట సుబ్బయ్య దంపతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ టిఫిన్ సెంటర్ అధినేత ఎన్.సరస్వతి, చిగురింతపాలెం గ్రామస్థులు, తిరుమల పాదయాత్ర సభ్యులు, వెంకటేశ్వర భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.


మెరీనా బీచ్‌లో రూ.41.61 కోట్లతో పైకప్పు

అడయార్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్‌లో రూ.41.61 లక్షలతో నీడనిచ్చేలా పైకప్పు (షెడ్ కానోపీ) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. మెరీనా బీచ్‌లోని పిల్లలు ఆడుకునే ప్రాంతంలో షెడ్ కానోపీ ఏర్పాటుకానుంది. ఎండా కాలంలో కూడా పిల్లలు నీడలో ఉంటూ ఆడుకునేలా ఈ వసతి ఏర్పాటుచేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.



సేవింతురే!

వెంకన్నకు తాత తిరుమల నంబి


చిత్రం: శింగిరి మునెయ్య

తిరుమల శ్రీవేంకటేశ్వరుని భక్తాగ్రేసరుల్లో అగ్రగణ్యుడు తిరుమలనంబి. 10వ శతాబ్దంలో శ్రీరంగం నుంచి తిరుపతికి చేరుకున్న భక్తుడు ఈయన. శ్రీవారికి తీర్థకైంకర్యాలు ప్రారంభించిన వాడు. భగవద్రామానుజులకు మేన మామ, గురువు. తిరుమల క్షేత్రం సేవలోనే జీవితం గడిపినవాడు. సాక్షాత్తూ వెంకటేశ్వరుడిచే తాతా అని పిలిపించుకున్న భక్తుడు. తిరుమల ఆలయప్రాకార మాడవీధిలో తిరుమలనంబి సన్నిధి ఉంది. ఉత్సవాల్లో ఇక్కడ ఆగి హారతి తీసుకుని స్వామి ముందుకు కదులుతాడు. ప్రతిరోజూ ఉదయం తిరుమలలో శ్రీవారి పూజా కైంకర్యాలు ముగించుకుని తిరుమలనంబి అలిపిరికి చేరుకునే వారు. గోవిందరాజస్వామిని సేవించుకుని రామానుజాచార్యులు ఆదే సమయానికి అక్కడికి వచ్చేవారు. ఒక రాతిగుండు పక్కన చింతచెట్టుకింద రామాయణ ఉపదేశాలను మేనల్లుడైన రామానుజులుకి వినిపించే వారు. ఈ ఉపదేశాలను అనుగ్రహించి అలిపిరిలో శ్రీవారు తన పాదముద్రలు విడిచారట. అవే అలిపిరి శ్రీవారి పాదాలుగా నేటికీ భక్తుల పూజలందుకుంటున్నాయి.



సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.01 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,628

తలనీలాలు సమర్పించినవారు: 21,511

బొమ్మల కొలువుకు ఆహ్వానం

అడయార్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ జీఎన్ చెట్టి రోడ్డులోని ఓ ఇంట్లో ఏర్పాటైన బొమ్మల కొలువును ప్రజలు వీక్షించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ విషయమై 'తేజస్' సహా వ్యవస్థాపకులు శాంతి చంద్రశేఖర్ మాట్లాడుతూ... 'స్వర్ణ కొలువు' పేరిట ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనలో శివ పరమాత్ముడు, కల్యాణ సుందరుడు, మీనాక్షి సుందరేశ్వరుడు, ఉమా మహేశ్వరుడు, గజసంహార, కామసంహార, కాలసంహార, దక్షిణామూర్తి, యోగేశ్వరుడు సహా 82 రూపాల్లో దర్శనమిస్తారని తెలిపారు. ఈ బొమ్మల కొలువును అక్టోబరు 3వ తేది వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచితంగా తిలకించవచ్చని చంద్రశేఖర్ తెలిపారు.


వివిధ రూపాల్లో శివ పరమాత్ముడి చిత్రాలతో బొమ్మల కొలువు



కనువిందు చేసిన కళోత్సవం



తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో గురువారంనాటి చిన్నశేష వాహన సేవలో కళా ప్రదర్శనలు కనువిందు చేశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 18 కళాబృందాల్లోని 430 మంది కళాకారులు తమ కళా విన్యాసాలతో అబ్బురపరిచారు. విశాఖపట్నం సునీత బృందం ప్రదర్శించిన గోవింద గానం నృత్యం వేంకటేశ్వరస్వామి వైభవాన్ని చాటింది. తెలంగాణకు



చెందిన గౌరవిరెడ్డి బృందం కుంభ మయూర నృత్యం నెమళ్లు సంచరించిన అనుభవాన్ని కలిగించింది. మహారాష్ట్ర తరుణశేఖర్ జానపద బృందం ప్రదర్శనలో కళాకారుల భంగిమల్లో మెరుపు వేగం అబ్బురపరిచింది. కర్ణాటకకు చెందిన డాక్టర్ దర్శిని మంజునాథ్ బృందం శ్రీకృష్ణలీలా తరంగిణి నృత్యరూపకం అకర్షించింది. మండపేటకు చెందిన వీరవేణి బృందం కోలాటం, కడప జిల్లాకు చెందిన బాబు బృందం డ్రమ్ములయ విన్యాసాలు, విశాఖపట్నంకు చెందిన లక్ష్మీబృందం శ్రీకృష్ణ రసలీల రూపకం ఓలలాడించాయి. కేరళకు చెందిన అభిషేక్ బృందం కథకళి, పాండిచ్చేరికి చెందిన తిరుమురగన్ కరగట్టం ప్రదర్శించారు. తిరుపతి వెంకటేశ్వర సంగీత నృత్య కళాశాలకు చెందిన డాక్టర్ ఉషారాణి ప్రదర్శించిన దేవేరుల చిన్న వాహన సేవ, మహారాష్ట్రకు చెందిన రాహుల్ హల్దే బృందం హోలీ నృత్యం, సీహెచ్ అజయ్ బృందం కూచిపూడి నృత్యం,గూడూరుకు చెందిన శైలజా కుమారి బృందం భక్తప్రహ్లాద రూపకం, అస్సాంకు చెందిన జోయ్‌దేవ్ దేకా బృందం బోర్తాల్ నృత్యం, పశ్చిమబెంగాల్‌కు చెందిన ప్రసూన్ బెనర్జీ బృందం జుహ్మర్ నృత్యం నేత్రపర్వంగా సాగింది.త్రిపురకు చెందిన రాజు యోగ్ బృందం సన్షైన్ గొడుగుల నృత్యం, తూర్పుగోదావరి జిల్లా తణుకుకు చెందిన హారిక బృందం, తిరుమలకు చెందిన శ్రీనివాసులు కోలాట నృత్యాలతో తన్మయపరిచారు. వాహన సేవ కొనసాగుతున్నంత సేపు మహావీధుల్లో కళా ప్రదర్శనలు భక్తులను కనువిందు చేశాయి.





జానపద విజ్ఞానం... మానవుడి జీవితమంత విశాలం

● ఆచార్య విస్తాలి శంకరరావు

ప్యారీస్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): జానపద విజ్ఞానం మానవుడి జీవితమంత విశాలమైనదని మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు పేర్కొన్నారు. మెరీనా బీచ్‌రోడ్డులోని రాజదాని కళాశాల తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎలిజబెత్ జయకుమారి అధ్యక్షతన గురువారం ఉదయం 'జానపద విజ్ఞానం-ఆధునిక చూపు' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ఆచార్యులు డాక్టర్ ఎం.మురళీ ఆహ్వానం పలుకగా, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రామన్ ముఖ్యఅతిథిగా హాజరై రాజధాని కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, బోధనా విధానాన్ని అభినందించారు. ఆత్మీయ అతిథి ఆచార్య విస్తాలి శంకరరావు ఉపన్యసిస్తూ... జానపద విజ్ఞానమే కాకుండా ఏ విజ్ఞానమైనా ఎప్పటికప్పుడు ఆధునిక దృష్టితో చూడడమనేది మంచిసంప్రదాయమని, జ్ఞానపద విజ్ఞానంతో మానవ జీవితానికి మంచి సంబంధాలున్నాయన్నారు. జానపద సాహిత్యమంటే మౌఖిక సాహిత్యమని, ప్రపంచంలో మనకు రెండు రకాల సాహిత్యాలు కనిపిస్తున్నాయని, అవి నోటి సాహిత్యం, రాత సాహిత్యమన్న ఆయన జానపద విజ్ఞాన వర్గీకరణాంశాలు అందులోని వివిధ శాఖల విశిష్ఠత వివరించారు. కార్యక్రమంలో ఆచార్య ఎల్బీ శంకరరావు దంపతులు, డాక్టర్ నిర్మలా పళనివేలు, డాక్టర్.టి.మోహనశ్రీ, గుడిమెట్ల చెన్నయ్య, ధనుంజయులు, నాగేశ్వరరావు, తెలుగుశాఖ ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు. పరిశోధక విద్యార్థి బాల ముని శివకుమార్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.


ఆచార్య విస్తాలి శంకరరావును సత్కరిస్తున్న ఎలిజబెత్ జయకుమారి, నిర్మలా పళనివేల్

17న 'కార్మేని సెల్వం' విడుదల

ట్యాక్సీ డ్రైవర్ జీవన చిత్రాన్ని వివరించే చిత్రంగా 'కార్మేని సెల్వం' రూపొందించినట్టు చిత్ర దర్శకుడు రామ్ చక్రి వెల్లడించారు. పాత్ వే ప్రొడక్షన్స్ పతాకంపై అరుణ్ రంగరాజు నిర్మించగా, అక్టోబరు 17వ తేదీన విడుదలచేయనున్నారు. సముద్రఖని, గౌతం వాసుదేవ్ మేనన్, లక్ష్మిప్రియ చంద్రమౌళి, అభినయ ప్రధాన పాత్రలను పోషించారు. ఈ మూవీ టీజర్ ఇప్పటికే రిలీజ్ చేయగా, మంచి స్పందన వచ్చింది. అలాగే, బుధవారం ఈ మూవీ నుంచి తొలి లిరికల్ సాంగ్ విడుదల చేశారు. ఈ చిత్రం విశేషాలను దర్శక నిర్మాతలు మీడియాకు వివరిస్తూ, 'కార్మేని సెల్వం' నిజాయితీ కలిగిన ట్యాక్సీ డ్రైవర్ కథ. ఒక్క లైనులో చెప్పాలంటే నిజాయితీగల ఒక కారు డ్రైవర్ అత్యాశకు పోవడం వల్ల అతని జీవితంలో ఎదురయ్యే సమస్యల సమాహారమే ఈ చిత్ర కథ. ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా ఈ స్టోరి వివరించే ప్రయత్నం చేశాం. తొలి సింగిల్ ఈ సినిమాకు ఆత్మవంటిది. ఖచ్చితంగా ఈ పాటతో పాటు చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని గట్టిగా నమ్ముతున్నాం. గౌతం వాసుదేవ్ మేనన్ కీలకమైన పాత్ర పోషించారు. ఈ సినిమాకు మ్యూజిక్ క్లౌడ్ స్టూడియో సంగీతం సమకూర్చింది. ఇది కోలీవుడ్‌లో ఒక కొత్త ప్రయోగం. ఇప్పటివరకు సంగీత దర్శకుడి పేరును టైటిల్ కార్డులో చూశాం. ఈ సినిమాకు మాత్రం మ్యూజిక్ క్లౌడ్ స్టూడియో అండ్ టెక్నాలజీ సంగీత స్వరాలను అందించింది' అని వివరించింది.


చిత్రం'లో సముద్రఖని, లక్ష్మిప్రియ

స్వదేశీ శస్త్రచికిత్స సంరక్షణలో మార్పులు

● డాక్టర్ పరిముత్తుకుమార్

అడయార్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా స్వదేశీ శస్త్రచికిత్స సంరక్షణలో మార్పులు జరిగాయని ప్రశాంత్ హాస్పిటల్స్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోబోటిక్ సర్జరీస్ క్లినికల్ హెడ్ డాక్టర్ పరిముత్తుకుమార్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో డాక్టర్ పరిముత్తుకుమార్ నేతృత్వంలో విజయవంతంగా వంద స్వదేశీ రోబోటిక్ ఉదర శస్త్రచికిత్సలు పూర్తయిన నేపథ్యంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చెన్నైలో ఈ మైలురాయిని చేరుకున్న మొట్టమొదటి ఆస్పత్రి తమదేనని పేర్కొన్నారు. 340 కి.మీటర్లు కవర్ చేస్తూ దేశంలోనే మొట్టమొదటి ఇంటర్-హాస్పిటల్ రోబోటిక్ టెలిసర్జరీ నిర్వహించిన మొదటి వైద్యుడిని తానేనని వివరించారు. ప్రతి రోగి ఎక్కడ నివశిస్తున్నారన్నదానితో సంబంధం లేకుండా, అధునాతన స్వదేశీ రోబోటిక్ టెక్నాలజీ ద్వారా ఖచ్చితమైన సంరక్షణ అందించడమే తమ లక్ష్యమని వివరించారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ కృష్ణ మాట్లాడుతూ.. తమ ఆస్పత్రిలో దేశంలోనే తయారైన అత్యంత అధునాతన వైద్యసాంకేతిక పరిజ్ఞానాలను తీసుకురావడం, తమ రోగులకు పరివర్తన, ఖచ్చితత్వంతో కూడిన సంరక్షణ అందించడం తమ అచంచలమైన నిబద్ధత అని పేర్కొన్నారు.



రోబోటిక్ శస్త్రచికిత్స చేయించుకున్న రోగులతో డాక్టర్ పరిమత్తుకుమార్, డాక్టర్ ప్రశాంత్ కృష్ణ తదితరులు

నాలుగు రోజులు హోరెత్తనున్న కరూర్

అడయార్,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి):పలుపార్టీల నేత ల పర్యటనతో కరూర్ జిల్లా నాలుగురోజులు హోరెత్తనుంది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి చేపట్టిన 'మక్కలై కాప్పోం...తమిళనాట్టై మీడ్పోం' ప్రచారం గురు, శుక్రవారాల్లో జరుగనుంది. ఇక, టీవీకే అధ్యక్షుడు విజయ్ 27వ తేది, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి 28న కరూర్‌లో ప్రచారం చేయనున్నారు. సభలు విజయవంతం చేసేందుకు ఆయా పార్టీ నేతలు సన్నాహాలు చేపట్టారు.


ఆర్ఎస్ఎస్ మాజీ అధ్యక్షుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

పైరసీ కంటే నెగిటివ్ ప్రచారం ప్రమాదకరం

● 'మెయ్యళగన్' దర్శకుడు ప్రేమ్‌కుమార్



చిత్ర పరిశ్రమకు పైరసీ కంటే నెగిటివ్ ప్రచారం ఎంతో ప్రమాదకరమని 'మెయ్యళగన్' చిత్ర దర్శకుడు ప్రేమ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కార్తి, అరవింద్ స్వామి ప్రధాన పాత్రలను పోషించిన 'మెయ్యళగన్' విడుదలై రెండేళ్ళు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ప్రేమ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని ముందుగా మలయాళంలో తీసి, తమిళంలోకి అనువాదం చేసివుంటే సూపర్‌హిట్ అయ్యేదని అనేక మంది నాతో అన్నారు. నా మాతృభాషలో సినిమా తీస్తే దాన్ని మలయాళంలో తీసి డబ్ చేసివుండొచ్చని చెపుతుంటే ఎంతో బాధ అనిపించింది. ఇది మంచి కుటుంబ కథా చిత్రం. థియేటర్లలో ప్రేక్షకుల నుంచి సరైన ఆదరణ లభించలేదు. కానీ, ఓటీటీలో విశేష మద్దతు లభించడంతో తప్పించుకున్నాం. కొన్ని వాస్తలను అంగీకరించి తీరాల్సిందే. చిత్రపరిశ్రమకు పైరసీ కంటే నెగిటివ్ ప్రచారం ప్రమాదకరం. కొందరు ఈ తరహా ప్రచారాన్ని మానుకోలేరు' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

కొత్త దర్శకుడితో చియాన్ విక్రమ్?



డెబ్యూ డైరెక్టర్‌కు చియాన్ విక్రమ్ అవకాశం ఇచ్చారు. 'మావీరన్' ఫేం మడోన్ అశ్విన్, 'మెయ్యళగన్' చిత్ర దర్శకుడు ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో నటించాల్సిన విక్రమ్... అనూహ్యంగా కొత్త దర్శకుడికి అవకాశం ఇచ్చి కోలీవుడ్ వర్గాలను ఆశ్చర్యపరిచారు. అయితే, ప్రాజెక్టును సెట్స్‌పైకి తీసుకెళ్ళేంత వరకు దర్శకుడి పేరు గోప్యంగా ఉంచాలని విక్రమ్ కండిషన్ పెట్టినట్టు సమాచారం. అందుకే దర్శకుడి పేరు వెల్లడించలేదు. కాగా, ఈ మూవీని శాంతి టాకీస్ పతాకంపై అరుణ్ విశ్వ నిర్మించనున్నారు. మడోన్ అశ్విన్, ప్రేమ్ కుమార్ చెప్పిన కథ కంటే ఈ కొత్త దర్శకుడు స్టోరీ నచ్చడంతో చియాన్ విక్రమ్ ఈ సాహసం చేసినట్టు ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు.

వర్క్ ఇ జడ్‌తో ప్సిగో అవగాహనా ఒప్పందం


మీడియా సమావేశంలో నిర్వాహకులు

అడయార్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ, కన్సల్టింగ్, సాఫ్ట్‌వేర్ సేవల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్సిగో సంస్థ వర్క్ ఇ జడ్‌తో రూ.30 కోట్ల విలువైన మేనేజ్ ఆఫీస్ స్పేస్ ఒప్పందంపై సంతకం చేసింది. పెరుంగుడిలోని ఈ స్పేస్ ప్రారంభోత్సవానికి స్వాతి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపకులు కె.స్వామినాథన్, ప్సిగో సీఈవో కుమార్ శివరామన్, వర్క్ఇజ్ సీఈవో ప్రతాప్ మురళి తదితరులు హాజరయ్యారు.


ఎగ్మూరు చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో గురువారం ఉదయం వరల్డ్ రోస్‌డే సందర్భంగా క్యాన్సర్ బాధిత చిన్నారులకు గులాబీలను అందజేస్తున్న వైద్యులు